30 ఏళ్లుగా టిఫిన్ షాప్ నిర్వహిస్తున్నా..



నాకు ఇద్దరు పిల్లలు. భార్యతో కలిసి 1995లో శ్రీకాకుళం నుంచి విశాఖ వలస వచ్చాను. అప్పటి నుంచి సుమారు 30 ఏళ్లుగా ఎంవీపీ కాలనీలో టిఫిన్ షాపు నిర్వహిస్తున్నా. ఇదే నా కుటుంబ జీవనాధారం. ఇద్దరు పిల్లలను బీటెక్, బీఎస్సీల వరకు చదివించుకున్నా. ప్రస్తుతం ఆకస్మాత్తుగా వచ్చి షాపులు తొలగిస్తుంటే మేం ఎలా బతకాలి. దశాబ్దాలుగా నాకు జీవనాధారంగా నిలిచిన బతుకుతెరువును పడగొట్టొద్దని, బడుగుల జీవితాలతో ఆడుకునే విధ్వంసకాండను జీవీఎంసీ ఆపాలని కోరుకుంటున్నా.

– లక్ష్మణరావు, చిరు వ్యాపారి

కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి..?



ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కూడలిలో షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. గత 10 ఏళ్లుగా ఈ దుకాణమే మాకు జీవనాధారం. ప్రస్తుతం జీవీఎంసీ చేపట్టిన విధ్వంసంతో మంగళవారం నా షాపును కోల్పోయాను. కనీసం షాపులోని సామగ్రి తీసుకునే సమయం కూడా అధికారులు ఇవ్వలేదు. అప్పటికప్పుడు విద్యుత్ సరఫరా కట్ చేసి నిమిషాల వ్యవధిలో షాపును కూడా పీకేశారు. వేల మందిని హఠాత్తుగా ఇలా రోడ్డుపాలు చేయడం కూటమి ప్రభుత్వానికి, జీవీఎంసీ అధికారులకు న్యాయం కాదు.

– పద్మావతి, చిరు వ్యాపారి

సమాచారం లేకుండా తొలగించేశారు



కొన్నేళ్లుగా రామ్‌నగర్ కూడలి సమీపంలో పాన్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఇటీవల జీవీఎంసీ సిబ్బంది హఠాత్తుగా వచ్చి షాపును తొలగించేశారు. కనీసం షాపులోని సామగ్రి కూడా తీసుకోనివ్వలేదు. కనీస సమాచారం లేకుండా షాపును ధ్వంసం చేయడంతో సరకులు మొత్తం నష్టపోయాం. ఇప్పుడు కుటుంబ పోషణ ఎలా చేసుకోవాలో తెలియని పరిస్థితి. పేదవారికి జీవన మార్గం చూపించాల్సిన ప్రభుత్వమే ఇలా నడిరోడ్డున పడేయడం అన్యాయం. చిరు వ్యాపారులకు ప్రభుత్వమే ప్రత్యామ్నాయ మార్గం చూపించాలి.

– ఎం.శిరీష, చిరువ్యాపారి



- షాపులు, బడ్డీల తొలగింపుతో నడ్డి విరిచిన జీవీఎంసీ
- వారం రోజుల్లో మారిపోయిన బడుగుజీవుల జీవితాలు
- హఠాత్ పరిణామంతో రోడ్డున పడ్డ చిరు వ్యాపారులు
- అప్పులతో పెనుభారం కానున్న కుటుంబ పోషణ
- ఉపాధి కోల్పోనున్న వేల మంది స్కిల్డ్ వర్కర్లు
- ప్రత్యామ్నాయంపై కనీసం దృష్టి సారించని జీవీఎంసీ

ఫోకస్



చిరు వ్యాపారులకు...
తీరని వేదన..!



తొలగింపు నేపథ్యంలో బడ్డీలోని సామగ్రి బయట సర్దుకుంటున్న బాధితులు

ఎంవీపీ కాలనీ : ఆపరేషన్ లంగ్స్ పేరిట జీవీఎంసీ చేపట్టిన ప్రధాన రహదారుల్లో షాపుల తొలగింపు నగరంలోని బడుగు జీవుల ముఖచిత్రాన్ని ఒక్కసారిగా మార్చేసింది. దశాబ్దాలుగా ఈ షాపులపై ఆధారపడి జీవిస్తున్న వేల కుటుంబాలు హఠాత్ పరిణామంతో గగ్గోలు పెడుతున్నాయి. జీవీఎంసీ తమ బతుకుదెరువుపై కొట్టిందంటూ **బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు ఏం కావాలంటూ ఆవేదన చెందుతున్నారు. బడుగుల బతుకుతెరువుపై కనీస ఆలోచన లేకుండా జీవీఎంసీ తీసుకున్న తొలగింపుల నిర్ణయం మా పొట్ట కొట్టిందంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. ప్రస్తుతం నగరంలో ఎటు చూసినా బాధితుల ఆవేదనలు, ఆర్తనాదాలే దర్శనమిస్తున్నాయి.**

జోన్ – 2, 3లలో 8500 మంది వెండర్స్

విశాఖ తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ జోన్ – 2, జోన్ – 3లో విస్తరించి ఉంది. జీవీఎంసీ జోన్ – 3 కార్యాలయం పరిధిలో 5521 మంది స్ట్రీట్ వెండర్స్ ఉన్నట్లు అధికారిక అంచనా. అలాగే జోన్ – 2 పరిధిలో సుమారు 3 వేల మందికి పైగా చిరు వ్యాపారులున్నారు. వీరిలో కొందరు షాపుల ద్వారా వ్యాపారాలు చేసుకుంటుండగా మరికొందరు ఫుట్‌పాత్‌లపై షాపులు, మూవ్‌బుల్ కౌంటర్స్ పెట్టుకుని చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో 80 శాతం మందికిపైగా ఏటా జీవీఎంసీకి పన్నులు చెల్లిస్తున్నారు. దశాబ్దాలుగా వారి కుటుంబ పోషణకు బడ్డీలు, షాపులే జీవనాధారంగా ఉంటున్నాయి. వీరంతా జీవీఎంసీ మంజూరు చేసిన స్ట్రీట్ వెండర్ కార్డ్, ట్రేడ్ లైసెన్స్‌లు కలిగి వున్నారు. దీంతో ఈ షాపులు, బడ్డీల తొలగింపు చర్యలు చేపట్టే పరిస్థితి ఉంటే ముందుగా జీవీఎంసీ వారికి పునరావాసం కల్పించాల్సి వుంటుంది.



బడ్డీలు తొలగించారని ఆరిలోవ రోడ్డులో పోలీసుల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న చిరు వ్యాపారులు

వెయ్యికిపైగా షాపుల తొలగింపు...

జోన్ – 3, జోన్ – 2 పరిధిలో ఇప్పటి వరకు వెయ్యికి పైగా షాపులు తొలగించినట్లు ఆ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. సీతమ్మధార, కృష్ణా కళాశాల, ఎంవీపీ కాలనీ, సిరిపురం, శివాజీపాలెం, ఆరిలోవ, చినగదిలి, పెదగదిలి తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో బడ్డీలు తొలగించేశారు. ఫుట్‌పాత్ వ్యాపారంపై ఆధారపడి వేల మంది జీవనం సాగిస్తుండగా, ఆయా షాపుల్లో పనిచేస్తున్న కొన్ని వేల మంది స్కిల్డ్ వర్కర్లు ఉపాధి పొందుతున్నారు. నగరంలో చాలా ఏళ్లుగా హాకర్స్ జోన్లు, వెండర్స్ జోన్లు, ఫుడ్ కోర్టులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ జీవీఎంసీ ఆ దిశగా కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో వేలాదిగా పెరిగిపోతున్న కార్మికులు కుటుంబ జీవనం కోసం ఖాళీ ప్రదేశాల్లో షాపులు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు.

కనీసం వారికి నోటీసులు జారీ చేసి ముందస్తు సమాచారం ఇవ్వాల్సి వుంది. ఈ దిశగా జీవీఎంసీ కనీస చర్యలు చేపట్టకపోవడం ప్రస్తుతం పెద్ద దుమారం రేపుతోంది. టౌన్‌ప్లానింగ్ చర్యలతో ప్రస్తుతం వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

ఎల్వీపీలో ఐఐహెచ్‌పై జూమ్ సదస్సు నేడు

ఆరిలోవ : హనుమంతవాక వద్ద గల ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో గురువారం ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్సన్ (ఐఐహెచ్)పై జూమ్ సదస్సు నిర్వహించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించనున్న సదస్సుకు ఐడీ నంబరు 4068102633, పాస్‌వర్డ్ ఔ్కఉఐః2025తో ఆన్‌లైన్‌లో జాయిన్‌కావచ్చని డాక్టర్ వీరేంద్ర సహదేవ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ఐఐహెచ్‌పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మెదడులో ఒక రకమైన ద్రవ పదార్థం అధికంగా పెరగడం వల్ల తలలో ఒత్తిడి పెరుగుతుందన్నారు. దాని ద్వారా సంభవించే ఒకరకమైన వ్యాధిగా దీన్ని నిర్ధారించినట్లు తెలిపారు. దీనికి పూర్తి కారణాలు ఇంతవరకు తెలియకపోవడంతో ఇడియోపతిక్ అని పేరుపెట్టారన్నారు. దీనివల్ల తలనొప్పి రావడం, దృష్టి లోపం సంభవిస్తుందన్నారు. దీంతోపాటు ఒకటికి రెండుగా కనిపించడం, చెవి లోపల హోరుమనే శబ్దాలు వినిపించడం ఈ వ్యాధి లక్షణాలుగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ముందస్తు జాగ్రతలు తీసుకోవడానికి పూర్తిస్థాయి అవగాహన కోసం సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు 9989130882లో సంప్రదించాలని ఆయన కోరారు.

చిరు వ్యాపారుల బడ్డీల తొలగింపు దుర్మార్గం

బీచ్‌రోడ్డు : రాష్ట్రంలో పేద ప్రజలు నివసించే పరిస్థితి లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు అన్నారు. పేదలను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరగడంతో ఫుట్‌పాత్‌లు, రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్న వారిపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండానే వేలాది బడ్డీలు, తోపుడుబళ్లను ధ్వంసం చేసి తొలగించడం దుర్మార్గమన్నారు. కూటమి కార్పొరేటర్లను టూర్‌కు పంపించి... ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్ అధికారులు విశాఖలో లేని సమయంలో పక్కా కుట్రతో సీఎం చంద్రబాబే పేద ప్రజలను రోడ్డుపై పడేశారని ఆరోపించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



దాత చంద్రకాంత్, అమృత దంపతులకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ సునీల్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం గాజువాక దరి శ్రీనగర్‌కాలనీకి చెందిన మండవ మహేష్ రూ. లక్ష 116 విరాళం పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్‌లో అందజేశారు. దేవస్థానం తరపున ప్రోటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సునీల్ బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యూజీడీకి మరమ్మతులు



యూజీడీ పనులను పర్యవేక్షిస్తున్న పల్లా దుర్గారావు, అధికారులు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డులోని భానోజీ నగర్‌లో యూజీడీ పాడైపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో వాటికి బుధవారం మరమ్మతులు చేశారు. స్థానికులు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ దృష్టికి సమస్య తీసుకెళ్లడంతో... ఆమె జీవీఎంసీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. ఈ పనులను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు పర్యవేక్షించారు.

అగ్రిసెట్‌లో పట్నాల శ్రీకావ్యకు నాలుగో ర్యాంకు



చింతపల్లి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన అగ్రిసెట్‌లో స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో విద్యనభ్యసించిన సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో తొలి నాలుగు ర్యాంకులు సాధించారు. ఈ విషయాన్ని పరిశోధన స్థానం ఏడీఆర్/కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి బుధవారం తెలిపారు. ఆగస్టులో నిర్వహించిన అగ్రిసెట్– 2025పరీక్షలకు స్థానిక సేంద్రియ వ్యవసాయ కళాశాల నుంచి హాజరైన వారిలో శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన తర్రా రాంజీ మొదటి ర్యాంకు సాధించాడు. పాడేరు మండలం గొట్టుపల్లి గ్రామానికి చెందిన కుంతూరు మురళీకృష్ణ రెండో ర్యాంకు, జి.మాడుగుల మండలం మహా దేవాపురం గ్రామానికి చెందిన మినుములు రాజ్‌కుమార్ మూడో ర్యాంకు, విశాఖపట్నం జిల్లా మద్దిలపాలెం చైతన్యనగర్‌కు చెందిన పట్నాల శ్రీకావ్య నాలుగో ర్యాంకు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి, అధ్యాపకులు అభినందించారు.

ఆస్తి పత్రాలు పోయాయని ఫిర్యాదు

బీచ్‌రోడ్డు : వాల్తేర్ మెయిన్ రోడ్‌లో నివసిస్తున్న గంగిరెడ్డి శ్రీచరణ్ రెడ్డి ఆస్తి పత్రాలు పోయాయని మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. చినముసిడివాడ, సుజాతనగర్‌లోని టీచర్స్ లే అవుట్‌కు సంబంధించిన ఆస్తి పత్రాలను జిరాక్స్ నిమిత్తం సిరిపురంలోని ఓ షాప్ వద్దకు తీసుకెళ్లి... ఇంటికి వచ్చి చూస్తే ఒరిజినల్ డాక్యుమెంట్లు కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎవరికైనా దొరికితే మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అందించాలని పోలీసులు కోరారు.

దుర్గమ్మకు ఘనంగా పూజలు



అమ్మవారి ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

ఆరిలోవ : దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా ఆరిలోవ ప్రాంతంలో అమ్మవారి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. టి.ఐ.సి.పాయింట్, పాత ఆరిలోవ, తోటగరువు, రవీంద్రనగర్, డెయిరీఫారం, చినగదిలి, పెదగదిలి, శివాజీనగర్ – 2 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలతోపాటు దుర్గాబజార్, చినగదిలి, పెదగదిలి, దీన్‌దయాల్ పురం, విజయదుర్గా కాలనీ తదితర ప్రాంతాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం కాంప్లెక్స్‌లో ఉన్న పోలమాంబ అమ్మవారిని బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఇక్కడ మహిళలు కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, అర్చకులు భక్తులతో హోమం నిర్వహించారు. ఇతర ప్రాంతాల్లోని మండపాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

చండికాదేవి ఆలయంలో వైభవంగా పూజలు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 4లోని శ్రీ చండికాదేవి ఆలయంలో దసరా ఉత్సావాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం చండీ హోమంలో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. నవరాత్రులు ముగిసే వరకు ఆలయ ప్రాంగణంలో నిత్యం పూజా కార్యక్రమాలతోపాటు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ఉమాదేవి, కోశాధికారి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు బోర్‌వెల్ శ్రీహరిరాజు, ఎస్.మూర్తి, రామమోహన్‌రావు, వెంకటరావు, టీఎన్ మూర్తి, రామకృష్ణ, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, మహిళలు

కూటమి ప్రభుత్వ మోసాలపై నిలదీయాలి

ఎంవీపీ కాలనీ : వైఎస్సార్‌సీపీ చేపట్టిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం బుధవారం జీవీఎంసీ 18వ వార్డులోని 123వ నంబరు బూత్ పరిధిలో కొనసాగింది. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత అమలు చేయకుండా మోసం చేస్తుండడంపై ప్రజలు నిలదీయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సూచించారు. కూటమి ప్రభుత్వ మోసాలపై ముద్రించిన కరపత్రాలు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ మాట్లాడుతూ మోసపూరిత హామీలతో కూటమి నాయకులు 2024 ఎన్నికల్లో గెలిచారన్నారు. ఏడాదిన్నర పాలనలో హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. కొన్ని పథకాలు అరకొరగా అమలు చేస్తూ లక్షలాది మంది లబ్ధిదారులకు మొండి చేయి చూపిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలపై ఆ పార్టీల నాయకులను ప్రజలంతా నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు పేర్ల విజయచందర్, విశాఖ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ఎల్లాజీ, వార్డు మహిళ విభాగం అధ్యక్షురాలు గరికిన ధనలక్ష్మి, బీఎల్ఏ కె.రవితేజ, ఫిషర్మెన్ సొసైటీ అధ్యక్షుడు మారుపల్లి పరదేశి, సురేష్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



18వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు కల్యాణ్ తదితరులు

పదవీ విరమణ అనంతరం కొత్త జీవితం

ఎంవీపీ కాలనీ : ఏ వ్యక్తికైనా పదవీ విరమణ అనంతరం జీవితంలో మరో కొత్త అధ్యాయం ఆరంభమవుతుందని దామోదర్ సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ అన్నారు. ఎంవీపీ కాలనీ ఐఐఏఎం బిజినెస్ స్కూల్, డాక్‌యార్డ్ సంయుక్తంగా ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ఫర్ నావల్ డాక్‌యార్డ్ పోస్ట్ రిటైర్‌మెంట్ అడాప్షన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ సేవల నుంచి విరమణ పొందిన తర్వాత కొత్త లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. ఇలాంటి ఓరియంటేషన్ కార్యక్రమాలు పునఃనిర్మాణానికి సహాయపడతాయన్నారు. ఐఏఎం డీన్ డాక్టర్ సుంకరి రవీంద్ర మాట్లాడుతూ ఐఏఎం బీస్కూల్ విద్యాపరమైన అంశాలతోపాటు నేవల్ ఫ్రటర్నిటీకి సేవలు అందించడం గర్వకారణమన్నారు. అనంతరం అతిథులను ఐఏఎం బీస్కూల్ డైరెక్టర్ జనరల్ కృష్ణమోహన్ సత్కరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఏయూ మాజీ వీసీ ఆచార్య రాజేంద్రప్రసాద్, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావు, కమాండర్ బీఎల్ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఆచార్య సత్యనారాయణకు జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ సుంకరి రవీంద్ర, ఆచార్య కృష్ణమోహన్

ప్రతిఘటిస్తున్నా... ఆగని విధ్వంసం

- జీవీఎంసీ 16వ వార్డులో చిరు వ్యాపారుల బడ్డీల నేలమట్టం
- ఆక్రమణల తొలగింపు వేళ తీవ్ర ఉద్రిక్తత
- నోటీసులివ్వకుండా రోడ్డున పడేశారని బాధితుల ఆవేదన





కృష్ణా కళాశాల రోడ్డులో పోలీసు బందోబస్తు మధ్య బడ్డీలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్దిలపాలెం : బడుగు జీవులు ప్రతిఘటిస్తున్నా కూటమి పాలకులు కనికరించడం లేదు. అధికారం అండతో దూసుకొస్తున్న పొక్లెయిన్లు నిర్దాక్షిణ్యంగా బడ్డీలు నేలమట్టం చేస్తూ చిరు వ్యాపారులను రోడ్డున పడేస్తున్నాయి. రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్న చిరువ్యాపారుల పొట్ట కొట్టొద్దని... రోడ్డున పడేయవద్దని ఇప్పటికే వైఎస్సార్ సీపీ నాయకులతోసహా పలు సంఘాల నాయకులు ఆందోళనలు చేసి అధికారులకు వినతిపత్రాలు అందించారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం కర్కశత్వంతో చిరు వ్యాపారులకు వేదన మిగుల్చుతూ విధ్వంసం కొనసాగిస్తోంది. వారం రోజులుగా కొనసాగుతున్న కూల్చివేతల పర్వం తాజాగా జీవీఎంసీ 16వ వార్డు పరిధి ఆటోమోటివ్ నుంచి హెచ్‌బీకాలనీ, ఎంఎంటీసీకాలనీ వరకు బుధవారం కొనసాగింది. రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను, చిరు వ్యాపారాలను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ మధుసూదన్ పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు. బుధవారం ఉదయం 7 గంటలకే టౌన్‌ప్లానింగ్, సచివాలయ సిబ్బంది, పోలీసులు లారీలు, క్రేన్‌లు, పొక్లెయిన్‌లతో కృష్ణా కళాశాల రోడ్‌లో మోహరించారు. రోడ్డు మార్జిన్ లోపల ఉండే దుకాణాలను వదిలేస్తారని ఊహించిన వ్యాపారులకు తట్టుకోలేని దెబ్బ తగిలింది. వాటిని కూడా అధికారులు విడిచిపెట్టలేదు. రోడ్డు పక్కన కనిపించిన ప్రతీ బడ్డీని, తోపుడు బండినీ ఊడ్చి పడేశారు. కూటమి పాలకులు, అధికారుల చర్యలతో రోడ్డున పడ్డామని చిరు వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. కొంతమంది జీవీఎంసీ సిబ్బందితో వాగ్వాదానికి దిగినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అధికారులు, సిబ్బంది వీరి మాటలను లెక్క చేయకుండా బడ్డీలను నేల మట్టం చేసేశారు. కొన్నిచోట్ల ఇటుక, సిమ్మెంట్‌తో నిర్మించిన వాటిని జేసీబీ సాయంతో కూల్చివేశారు. రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించి లారీల్లో తరలించారు. పాలకులు, అధికారుల చర్యలతో జీవనోపాధి కోల్పోయామని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరాల తరబడి వ్యాపారం చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నా... హఠాత్తుగా మా ఉపాధి తొలగించి రోడ్డున పడేశారని వాపోతున్నారు. ప్రభుత్వమే ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

తత్వ పారంగతుడు సచ్చిదానందమూర్తి



ఆచార్య సచ్చిదానందమూర్తి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఒడిశా గవర్నర్ హరిబాబు, ఏయూ ఆచార్యులు

సీతంపేట: ఆధునిక భారతదేశంలోని తత్వశాస్త్ర కోవిదుల్లో ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తిది ఒక ప్రత్యేక స్థానమని ఒడిశా రాష్ట్ర గవర్నర్ ఆచార్య కంభంపాటి హరిబాబు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో ఏయూ తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఐసీపీఆర్ అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఎక్స్‌ప్లోరింగ్ ద ఫిలసాఫికల్ లెగసీ ఆఫ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి అనే అంశంపై మూడు రోజుల సదస్సులో ప్రసంగించారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సచ్చిదానందమూర్తి విగ్రహానికి హరిబాబు నివాళులర్పించారు. ఆచార్య సచ్చిదానందమూర్తి రచనలు, పరిశోధనలు నిరంతరం మనల్ని చైతన్యవంతులను చేస్తూ ఉంటాయన్నారు. ఆయన జీవితాన్ని బోధన, పరిశోధనకు అంకితం చేసిన విధానాన్ని వివరించారు. విశ్వహిందీ పరిషత్ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఆచార్య సచ్చిదానందమూర్తితో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, ఆచార్య రమేష్ బాబు, రెక్టార్ ఎస్.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణలో ఫార్మాకోవిజిలెన్స్ పాత్ర కీలకం

మహారాణిపేట: రోగుల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో ఫార్మాకోవిజిలెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి అన్నారు. బుధవారం కాలేజీ సమావేశ మందిరంలో 5వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఫార్మకాలజీ కోఆర్డినేటర్ డాక్టర్ డి.శ్యామల మాట్లాడుతూ ఫార్మకోవిజిలెన్స్ ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మన్మథరావు, డాక్టర్ ఎ.కృష్ణవేణి, పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. పది కంపెనీలు పాల్గొని 900 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ చదివిన ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం.ఏపీజీఓవి.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిట్ కార్డ్‌తో హాజరు కావాలని తెలిపారు. స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా ఉందని, 8555868681 నంబర్‌లో సంప్రదించాలన్నారు.